ప్రజాశక్తి

మంగళవారం 28 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



విశాఖ నగరంలో కురుస్తున్న జోరు వాన

ముంచెత్తిన వాన

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మొంథా ఎఫెక్ట్
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- పునరావాస కేంద్రాలకు బాధితులు
- పలు విమానాలు, రైళ్లు రద్దు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'మొంథా' తుపాను ప్రభావంతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం వర్షం ముంచెత్తింది. విశాఖలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 26 డిగ్రీలకు పడిపోయాయి. భారీ వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చాలావరకూ జనం ఇళ్లల్లోనే ఉండిపోయారు. తుపాను ప్రస్తుతం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ మంగళవారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని విశాఖపట్నం, అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. సోమవారం సాయంత్రానికి విశాఖకు 560 కిలోమీటర్ల దూరంలో తుపాను ఉంది. 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఈ నేపథ్యంలో విశాఖకు ఢిల్లీ నుంచి



ఒడ్డుకే పరిమితమైన బోట్లు

రావాల్సిన ఇండిగో విమానాన్ని సోమవారం ఉదయమే దారిమళ్లించారు. మంగళవారం ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఫ్లైట్స్‌ను ఎయిర్ పోర్టు అధికారులు రద్దుచేశారు.

జలాశయాల వద్ద అప్రమత్తం

విశాఖలోని గంభీరం, మేఘాద్రిగెడ్డ జలాశయాల వద్ద పరిస్థితిని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. విశాఖలోని 12,755 ఇళ్లు కొండవాలు ప్రాంతాల్లో ఉండగా వాటిలో 96 ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 20 సైక్లోన్ షెల్టర్లు, 23 పునరావాస కేంద్రాలకు సుమారు 9 వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

తీరం దాటే వరకూ ముప్పే

మొంథా మంగళవారం అర్ధ రాత్రికి కాకినాడ సమీపంలో మిగతా 2లో..



పరవాడలో పర్యటిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి జిల్లాలో..

అనకాపల్లి రూరల్ : 'మొంథా'పై జిల్లా అధికారులు అలర్ట్ అయ్యారు. ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అవసరమయ్యే అన్ని చర్యలూ చేపడుతున్నారు. కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హా, ప్రత్యేక అధికారి వినయ్ చంద్ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లు, ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే తీరప్రాంతాలు, నదీ తీర గ్రామాల్లో మానవ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, ఆహార ప్యాకెట్లను అందిస్తున్నారు. సోమవారమంతా జిల్లాలో వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. కొన్నిచోట్ల పంటలు నీటమునిగాయి. దాదాపు జనజీవనం స్తంభించిపోయింది. విద్యా, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి.

మత్స్యకారుల జీవితాలతో చెలగాటం

▶ వార్త 8లో..

ఎసిబికి చిక్కిన ఆర్ఐ, సచివాలయ కార్యదర్శి

▶ వార్త 3లో..

అంబేద్కర్‌వాది పావనమూర్తి మృతి

▶ వార్త 4లో..



సదస్సులో మాట్లాడుతున్న లోకనాథం

టిడిఆర్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలి

భూ నిర్వాసితుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.లోకనాథం డిమాండ్

ప్రజాశక్తి- మునగపాక : అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు టిడిఆర్ నోటిఫికేషన్ రద్దుచేసి, 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని భూ నిర్వాసితుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్థానిక పిఎసిఎస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన రోడ్డు విస్తరణ బాధితుల సంఘం సదస్సులో ఆయన మాట్లాడుతూ విస్తరణ బాధితులకు ఈ నెల 14న ఎపి హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోతున్న 1200 మంది నిర్వాసితుల తొలి విజయం ఇదని పేర్కొన్నారు. ఐకమత్యంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చునని మిగతా 2లో..

డాక్టర్ పెంటకోట రామారావు కన్నుమూత

- ఉమ్మడి విశాఖ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విశేష సేవలు
- ఉచిత విద్య, వైద్యం కోసం విద్యార్థి దశ నుంచే పోరాటాలు
- అశ్రు నయనాల నడుమ అంతిమయాత్ర, పలువురు సంతాపం



రామారావు (ఫైల్)



పార్థివ దేహం వద్ద నివాళి అర్పిస్తున్న అజశర్మ

ప్రజాశక్తి - సీతమ్మధార/విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పూర్వ అధికారి డాక్టర్ పెంటకోట రామారావు (79) కన్నుమూశారు. సీతమ్మధార డాక్టర్స్ కాలనీలో ఉన్న తన గృహంలో ఆదివారం రాత్రి గుండె జబ్బుతో ఆయన మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె శ్రీదేవి ఉన్నారు. పెద్ద కుమారుడు డాక్టర్ పిటి.శ్రీనివాస్ ఆంధ్ర వైద్య కళాశాలలో పనిచేస్తున్నారు. రెండో కుమారుడు నవీన్ శంకర్ అమెరికాలో ఉన్నారు. డాక్టర్ రామారావు కెజిహెచ్‌లో చాలాకాలం వైద్యునిగా సేవలు అందించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ సీనియర్ ఉద్యమనేతగా, విశాఖ కన్స్యూమర్ కౌన్సిల్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయన మృతి సమాచారం తెలియడంతో సీత మ్మధారలో ఉన్న డాక్టర్ రామారావు గృహానికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి. కుమార్, పి.మణి, వి.కృష్ణా రావు, ప్రజారోగ్య వేదిక నాయకులు డాక్టర్ వైఎల్.నర్సింగరావు, కెవిపి.చంద్రమౌళి, వార్డు నాయకులు జివి.రమణ, పి.లచ్చిరాజు, సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు తదితరులు వెళ్లి డాక్టర్ రామారావు పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. డాక్టర్ రామారావు గృహం నుంచి అశ్రు నయనాల నడుమ అంతిమయాత్ర నిర్వహించారు. శాంతి వనంలో అంత్యక్రియలు జరిగాయి.

ప్రస్థానమిదీ..

డాక్టర్ రామారావు 1947 డిసెంబర్ 1న అనకాపల్లిలో జన్మించారు. ఎఎంఎఎల్ కాలేజీలో చదివి, అనంతరం ఆంధ్ర వైద్య కళాశాలలో విద్య అభ్యసించారు. వైద్యునిగా దీర్ఘకాలం పనిచేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టి 2005లో ఉద్యోగ విరమణ చేశారు. వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డిఆర్‌యుసిసి) మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

డాక్టర్ పెంటకోట రామారావు కన్నుమూత

మెంబర్‌గా, రాష్ట్ర, జిల్లా వినియోగదారుల పరిరక్షణ మండలి సభ్యునిగా, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యునిగా ఆయన ప్రస్తుతం సేవలందిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ కూడా అర్ధ శతాబ్దానికిపైగా వినియోగదారుల హక్కుల రక్షణ కోసం నిరంతరం ఆయన సేవలందించారు. కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షునిగానూ పనిచేశారు.

ప్రజా సమస్యలపై పోరాటం

ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందివ్వాలని విద్యార్థి దశ నుంచే పోరాడిన డాక్టర్ రామారావు వైద్యునిగా పేదలకు ఉచితంగా సేవలు అందించారు. అంతేకాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో పోరాటాలు నిర్వహించి, నాయకత్వం వహించారు. చివరి శ్వాస వరకు సామాజిక సమస్యలపై పోరాడుతూ వచ్చిన ఆయన ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలలో సేవలు అందించారు. ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాలకు వెళ్లి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. అరకు ప్రాంతంలోని ఓదుగెడ్డ గ్రామానికి ప్రజారోగ్య వేదిక ప్రతినిధులతో కలిసి గుర్రాలపై సుమారు వెయ్యి అడుగులు ఎత్తున ఉన్న ప్రాంతానికి వెళ్లి ఉచితంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. గత ఏడాది గిరిజన ప్రాంతంలోని ఓ గ్రామానికి అడ్డుగా ఉన్న నదిలో నాటు పడవపై వెళ్లి వైద్య సేవలు అందించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తన వాణిని వినిపించారు.

రామారావు తుది శ్వాస వరకు ప్రజలకు అండగా నిలిచి, ప్రభుత్వం తీసుకునే ప్రజా వ్యతిరేక చర్యలను నిర్మొహమాటంగా వ్యక్తపరిచే వారని వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్ తెలిపారు. ఆస్తి పన్ను, చెత్త పన్ను పెంపుదల, బిల్డింగ్ ఫీనలైజేషన్ స్కీం వంటి సమస్యలపై వార్వా, నివాస్ చేపట్టిన పోరాటాలలో ఉత్సాహంగా పాల్గొనేవారని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రభాత భేరి కార్యక్రమాలకు నాయకత్వం వహించారని తెలిపారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, సిపిఎం సంతాపం

రామారావు మృతి చాలా బాధాకరమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన నిత్యం ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని గుర్తుచేశారు. రామారావు మృతికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, విశాఖ, అనకాపల్లి జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, జి.కోటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

టిడిఆర్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

పేర్కొంటూ గతంలో గుంతలమయమైన ఇదే రోడ్డు నిర్మాణం చేపట్టాలని సంతకాల సేకరణ, మానవహారాలు, రాస్తారోకోలు చేయడం ద్వారా ప్రభుత్వం దిగివచ్చి రోడ్డు నిర్మాణం చేపట్టిన ఘటనను గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో నిర్వాసితులు 1200 మంది ఐక్యంగా పోరాడితే ప్రభుత్వాలు దిగిరాక తప్పదని అన్నారు. అర్బన్ ప్రాంతాలను పట్టణీకరణ చేయాలనే దురుద్దేశంతో ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. జివిఎంసి పరిధిలో టిడిఆర్‌లు తీసుకున్న అనేకమంది అవసరాలకు అమ్ముకోలేక అనేక ఇబ్బందులు పడడంతో పాటు టిడిఆర్ విలువలో సగం ధర కూడా రావడం లేదని అనుభవాలు చెబుతున్నాయన్నారు. డబ్బులు లేక టిడిఆర్‌లు జారీ చేస్తున్నట్లు ప్రభుత్వం మోసపూరిత మాటలు చెబుతోందని ఘాటుగా విమర్శించారు. పూలింగ్‌కు అంగీకరించని అమరావతి రైతులకు చట్ట ప్రకారం పరిహారం ఇస్తామని ప్రభుత్వం ముందుకు వచ్చినట్లే ఇక్కడ కూడా టిడిఆర్‌లు వద్దంటున్న బాధితులకు నిర్ణయించిన ప్రకారం నగదు జమ చేయాలన్నారు. బాధితుల మనోభావాలను గౌరవించి ప్రభుత్వం నడుచుకోవాలి తప్ప భయపెట్టే చర్యలు తగవని హితవు పలికారు. టిడిఆర్‌లకు తాము అంగీకరించేది లేదని, నగదు చెల్లించకుండా స్థలాలు, ఇళ్లు, భూములు అప్పగించేది లేదని ప్రభుత్వానికి వినిపించేలా నినదించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నగదు చెల్లింపు జరిగే వరకు ఐక్య పోరు సాగాలన్నారు. ఎస్.బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాసిత సంఘం నాయకులు జి.కోటేశ్వరరావు, కన్వీనర్ ఆర్.రాము, కో-కన్వీనర్ కె.రామసదాశివరావు, కర్రి అప్పారావు, గనిశెట్టి సత్యనారాయణ, నిర్వాసితులు పాల్గొన్నారు.

విసిసి బాలల దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం,వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) బాలల దినోత్సవం 2025 పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ దీప జలోక, వైస్ ప్రెసిడెంట్ సునీత విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,విసిసి చేస్తున్న కార్యక్రమానికి సహకారం అందిస్తున్నామన్నారు.ఈ సంవత్సరం ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విసిసి 'ప్రొటెక్టింగ్ అండ్ చెరిషి చైల్డ్ హుడ్' నినాదంతో చిల్డ్రన్స్ డే సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని విసిసి ఫౌండర్ డాక్టర్ కె.రమాప్రభ తెలిపారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా వున్న 135 క్లబ్స్‌లో బాలల దినోత్సవం 2025 పోటీలు నిర్వహిస్తామని విసిసి కన్వీనర్ కె.సుశీల అన్నారు. ఈ ఆటలు పోటీలు నవంబరు 2న ప్రారంభమై 14 వరకూ జరుగుతాయన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్,సీనియర్స్‌కి వారి ఆసక్తిని బట్టి విడివిడిగా పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9347205549 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో విసిసి నుంచి పిఎన్.మణి,ఆర్ సరోజ, పి.సతీష్, పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ముంచెత్తిన వాన

(మొదటి పేజీ తరువాయి..) తీరం దాటే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకూ అలర్ట్‌గా ఉండాలని ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఆ సమయంలో తీరం వెంబడి గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయనున్నాయి. ఈ నెల 29 వరకూ గాలుల వేగం ఉంటుంది. 30వ తేదీనాటికి సాధారణ పరిస్థితులు నెలకొననున్నాయి.

వర్షపాతం ఇలా..

గడిచిన 24 గంటల్లో విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా సగటున 75.0 మిల్లీలీటర్లతో మొత్తం 824.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. అత్యధికంగా సీతమ్మధారలో 89.2, అత్యల్పంగా పద్మనాభంలో 30.6 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్టు వెల్లడించారు.

దక్షిణంలో పలు ప్రాంతాలు జలమయం

దక్షిణ నియోజకవర్గంలోని పలు పల్లపు ప్రాంతాలు నీటి ముంపునకు గురయ్యాయి. 34వ వార్డులోని కల్లుపాకలు, 35వ వార్డులోని లక్ష్మీనగర్ ప్రాంతాలు నీట మునిగాయి. ఇళ్లలోకి వరద నీరు వచ్చింది. వెలంపేట, పూర్ణా మార్కెట్, 70 అడుగుల రోడ్డు, చావుల మదుం ప్రాంతాలలో రోడ్లు జలమయం అయ్యాయి. చావుల మదుంలో మోకాలు లోతు నీరు చేరడంతో అన్ని రకాల రాకపోకలకు అవరోధం కలిగింది. ఫిషింగ్ హార్బర్, జాలారిపేట ప్రాంతాలలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితం అయ్యారు. పడవలు తుఫానుకు కొట్టుకుపోకుండా ఉండేందుకు సురక్షిత ప్రాంతాలకు తరలించి తాళ్లతో బంధించి భద్రపరిచారు.

చేపల వేటకు అంతరాయం

భీమునిపట్నం : తుపానుతో చేపల వేటకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో చేపల వేటపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఆధారపడిన పలు కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. తుపాన్లు, భారీ వర్షాలు, వేటకు అననుకూల పరిస్థితులు తమను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పలువురు మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

అనుక్షణం.. అప్రమత్తం

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

విశాఖ కలెక్టరేట్ : మొంథా తుపాను పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపాటి దుర్ఘటన కూడా జరగడానికి వీలులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సైక్లోన్ జిల్లా ప్రత్యేకాధికారి, స్పెషల్ సిఎస్ అజయ్ జైన్ ఆదేశించారు. జీరో క్యాజువాలిటీ ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలని, శిథిల భవనాలు, గోడలను ముందుగానే గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. విరిగి పడడానికి అవకాశం ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. గాలుల తీవ్రతకు హోర్డింగులు కూలిపోయే ప్రమాదం ఉందని, ముందుగానే వాటిని తొలగించాలని జివిఎంసి కమిషనర్‌ను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, తుపానుకు ముందు ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. తుపాను నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో ఆయన జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తుపాను సన్నద్ధత, తక్షణ స్పందన, సహాయక చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు.

టిఫిన్, భోజనం ప్యాకెట్లను సిద్ధం చేసుకోవాలి

గంటకు 150 నుంచి 200 కిలోమీటర్ల వేగంతో తుపాను తీరం దాటే అవకాశం ఉందని, ఈ ప్రభావంతో చాలా నష్టం వాటిల్లవచ్చని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగవచ్చని అజయ్ జైన్ అన్నారు. కావున 29న ఉదయం, మధ్యాహ్నం నష్టం వాటిల్లిన ప్రాంత ప్రజలకు, తుపాను ప్రభావిత ప్రాంత పౌరులకు అల్పాహారం, భోజనం ప్యాకెట్లను అందించేందుకు యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మందులను కూడా అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. తుపానును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. సముద్ర తీరంలో 6 మెకనైజడ్ బోట్లను, నేవీ, కోస్ట్ గార్డ్ పరిధిలో హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచామని చెప్పారు.


సమీక్ష జరుపుతున్న అజయ్‌జైన్

జివిఎంసి పరిధిలో ముమ్మర ఏర్పాట్లు

జిల్లా యంత్రాంగంతో కలిసి అదనంగా 38 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. 20 క్యూఆర్‌టి (క్విక్ రెస్పాన్స్ టీమ్స్) బృందాలను నియమించామని, ఒక్కో జోన్ పరిధిలో రెండేసి బృందాలు ఉంటాయని చెప్పారు. ప్రతి బందం జెసిబి, టిప్పర్, ట్రాక్టర్, ట్రీ కట్టర్, బెయిలింగ్ మెషిన్ కలిగి ఉంటాయని వివరించారు.

కెజిహెచ్‌కు రోటరీ క్లబ్ వైద్య పరికరాల వితరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : రోటరీక్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో రూ.40 లక్షల విలువైన వైద్యపరికరాలను కెజిహెచ్‌కు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం అందజేశారు. 2 వెంటిలేటర్స్, 10 సిరంజి పంప్స్, 40 వీల్ చైర్స్, 100 కాట్స్, 5 రెస్పెటరీ హ్యూమిడిఫైర్స్ వంటి వైద్య పరికరాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ రోటరీక్లబ్‌లో ఎంతోమంది ప్రముఖులు పలు కార్యక్రమాలు విరివిగా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి,రోటరీ క్లబ్ పెద్దలు శోభన్ ప్రకాష్, ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి పాల్గొన్నారు.

వైజాగ్ మారథాన్ టీ షర్ట్, మెడల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 న జరగనున్న సంధ్యా మెరైన్స్ వైజాగ్ మారథాన్ 4వ ఎడిషన్ (మన వైజాగ్-మన మారథాన్) కోసం ప్రత్యేకంగా రూపొందించిన టీ-షర్ట్ మెడల్‌ను నవోటెల్ నాటికా హాల్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైజాగ్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణరాయ్ మాట్లాడుతూ పర్యావరణ అనుకూల విశాఖను ప్రోత్సహించడమే మారథాన్ ప్రధానలక్ష్యమని తెలిపారు. నగరమంతటా ఆరోగ్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రొఫెషనల్ కోచ్ ద్వారా ఉచిత శిక్షణ, కొత్తవారిలో ఉత్సాహం నింపడానికి ప్రతినెలా క్లబ్‌రన్‌లు నిర్వహిస్తున్నామ న్నారు. సొసైటీ సెక్రటరీ కంచేటి శ్రీనివాస్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈసారి మారథాన్ మునుపటి కంటే మరింత విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. టైటిల్ స్పాన్సర్ సంధ్యా మెరైన్స్ తరపున ఆనంద్, అపోలో హాస్పిటల్స్ (అరిలోవ) నుండి డా. కృష్ణప్రసాద్ నవోటెల్ నుండ లక్ష్మి, ఫైజర్ నుండి రవికట్టా (సైట్ క్వాలిటీ హెడ్), టాటా కాపర్ ప్రతినిధి టివిఎన్ సత్య మూర్తి, వైజాగ్ రన్నర్స్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దక్షిణ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇంచార్జ్ వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం కల్లుపాకలు, ప్రసాద్ గార్డెన్స్, లక్ష్మీ నగర్ ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు నిత్యావసర సరుకులను అందజేశారు.

మహారాజశ్రీ విశాఖపట్నం ఫ్యామిలీ జడ్జి కమ్ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
F.C.O.P. 1650/2024
బిట్వీన్
గొర్లె జగన్నాధరావు ...పిటీషనర్
అండ్
గొర్లె రమాదేవి ...రెస్పాండెంట్
టు
నోటీసు
రెస్పాండెంటు:
గొర్లె రమాదేవి, W/o. గొర్లె జగన్నాధరావు, హౌస్‌వైఫ్, నివాసం: డోర్ నెం.27-97-3, గొంతినవాని పాలెం, గాజువాక, విశాఖపట్నం-530026.
పైనెంబరు పిటీషన్‌లో పైతెలిపిన పిటీషనర్ గారు మీపై విడాకుల కొరకు పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ నందు కోర్టు ద్వారా పంపిన నోటీసులు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసియున్నారు. కావున పై పిటీషన్‌లో మీ హాజరు కొరకు **తేది. 27-11-2025**న వాయిదా అయివున్నది. ఆదినమున మీరు **ఉ॥గం॥10.30ని॥**లకు స్వయంగాగానీ, వకీలు గారి ద్వారాగాని పైతెలిపిన శ్రీ కోర్టులో హాజరై మీఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పైపిటీషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి శ్రీకోర్టు వారు మీ పరోక్షమందు తీర్మాణించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.
(By Order of the Hon'ble Court)
SAYYED ABDUL RAZAK, Advocate
Dabagardens, Visakhapatnam. **Cell:9885240837**

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
O.S. 23/2023
Between:
వాది: శ్రీ సుంకర భానుప్రకాష్, S/o. శ్రీరామమూర్తి, హిందూ, వయస్సు 62 సం॥లు, పురుషుడు, వ్యవసాయం, తణుకు T.JCJC.
ప్రతివాదు:
1) శ్రీమతి నీలి పార్వతి, W/o. బాలకృష్ణ, హిందూ, వయస్సు 70 సం॥లు, స్త్రీ, హౌస్ వైఫ్, ఫ్లాట్ నెం.203, Surampudi Enclave, NSC Base Road, తణుకు 534211, T.JCJC.
2) శ్రీమతి ఒగ్గు నాగమణి, W/o. కృష్ణ, హిందూ, వయస్సు 50 సం॥లు, స్త్రీ, హౌస్ వైఫ్, డో.నెం. 6-182, మెయిన్‌రోడ్డు, కన్నాపురం 534311, కొయ్యలగూడెం మండలం, JRG JCJC.
3) శ్రీమతి బొబ్బా పద్మజ W/o. వెంకట గణేష్, హిందూ, వయస్సు 46 సం॥లు, స్త్రీ, హౌస్ వైఫ్, డో.నెం. 19-47, చంద్రానగర్, గోపాలపట్నం రూరల్, విశాఖపట్నం 530027.
4) శ్రీమతి గుత్తికొండ వీణ అన్నపూర్ణ, W/o. గీతా మల్లేశ్వరరావు, హిందూ, వయస్సు 45 సం॥లు, స్త్రీ, Opp: BVS Palace Road, Velpur Road, తణుకు, T.JCJC.
5) శ్రీమతి గిడుతూరి సాయిలక్ష్మి, W/o. త్రిమూర్తి, హిందూ, వయస్సు 44 సం॥లు, స్త్రీ, హౌస్ వైఫ్, డో.నెం. 6-3-1247/430, రాజానగర్, Opp. Raj Bhavan, MS Maktha, Somajiguda, Nampalli, Hyderabad 500082.
యీ నెంబరు దావాలోను మరియు IA 966/2023 3వ ప్రతివాదికి / 3వ రెస్పాండెంటుకు దావా సమను మరియు నోటీసు కోర్టు ద్వారాను మరియు రిజిష్టర్ పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పంపించినను అమలు జరుగనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ ప్రకటన వేయడమైనది. యీ నెంబరులో 3వ ప్రతివాది/ 3వ రెస్పాండెంటు అయిన శ్రీమతి బొబ్బా పద్మజ, W/o. వెంకట గణేష్, విశాఖపట్నం అనువారు **ది. 21-11-2025వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారు పిలిపించే టైముకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపరచు కొనవలెను. లేనియెడల ఎక్స్‌పార్టీ చేసి పరోక్షమున తీర్మానించడమగును.
వాయిదా: 21-11-2025
CH.NAGA KUMAR, Advocate
Kovvur, Cell: 9440985149
M.BALAJI RAO, Advocate
Tanuku, Cell: 9440614905

'మొంథా'తో అధికారులు అప్రమత్తం

క్షేత్రస్థాయిలో పరిశీలన



పాండ్రంగి గోస్తనీ కాజ్‌వేపై రాకపోకలు నిషేధిస్తున్న అధికారులు, పోలీసులు

పద్మనాభం : మండలంలోని గోస్తనీ పరివాహక ప్రాంతాలలో మండల స్థాయి ప్రత్యేక అధికారి జ్ఞానవేణి పర్యవేక్షణలో అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. సామయ్యవలస, మద్ది, పొట్నూరు, పాండ్రంగి, విలాస్‌ఖాన్‌పాలెం, రేవిడి గ్రామాలను జ్ఞాన వేణితో కలిసి తహశీల్దార్ ఆనందరావు, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. పాండ్రంగి పంచాయతీ పరిధిలో ఉన్న పాత సామయ్యవలస, రెడ్డిపల్లి, కొవ్వాడ, పొట్నూరు ప్రాంతాలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. పాత సామయ్యవలస గ్రామంలో 32 కుటుంబాలకు భీమిలి మండలం మజ్జివలసలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పునరావాస కేంద్రంగా ఏర్పాటుచేశారు. పాత సామయ్యవలస – పాండ్రంగి మధ్య నీటి ప్రవాహం ఎక్కువైతే ముందస్తు ఏర్పాట్లులో భాగంగా పాండ్రంగి గ్రామంలో బిబిజి ప్రైవేట్ లే–అవుట్ వద్ద వరి పంటకు నష్టం ఏర్పడకుండా ప్రభుత్వ భూమిలో నుండి నీరు వెళ్లే విధంగా జెసిబితో అధికారులు దారి మళ్లింపు చర్యలు చేపట్టారు.

గోస్తని నది పక్కన ఉన్న విలాస్‌ఖాన్‌పాలెం, మద్ది, పాండ్రంగి, సామయ్యవలస, పొట్నూరు గ్రామాల ప్రజలు గోస్తని నది ఒడ్డుకు వెళ్లకుండా ఉండాలని అధికారులు ఆదేశించారు. పాండ్రంగి గ్రామంలోని కాజ్‌వే వైపు రాకపోకలను నిషేధించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ కె.ఆనందరావు, ఎంపిడిఒ కె.రూపేష్, సిఐ శ్రీధర్, ఎస్ఐ సురేష్, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు. పాండ్రంగి గ్రామంలో బిబిసి లే–అవుట్ వల్ల ముంపునకు గురై వరి పొలాల్లో ఉన్న నీటిని అధికారులు గోస్తని నదికి మళ్లించారు.

ఆనందపురం : మండల పరిధిలో తుపాను పరిస్థితులను మండల ప్రత్యేకాధికారి కె.రామారావు సోమవారం పర్యటించారు. గంభీరం రిజర్వాయర్ వద్ద నీటి మట్టాలు, సేఫ్టీ వాల్యులు పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. బోని గ్రామంలోని పలు కాలనీలను సందర్శించి, నీటి నిల్వ ప్రాంతాలపై సమాచారం సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం సిఐ వాసు నాయుడు, ఎస్ఐ శివ, తహశీల్దార్ శ్రీనుబాబు, ఎంపిడిఒ జానకి, ఎలక్ట్రికల్ ఎఇ అప్పలనాయుడు, ఇరిగేషన్ ఎఇ ఎన్.మహేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అవినాష్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి– భీమునిపట్నం : తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఆర్‌డిఒ సంగీత్ మాధుర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, జివిఎంసి, మండల పరిషత్, వ్యవసాయం, మత్స్య, విద్య, ఉద్యాన, పశు సంవర్ధక శాఖ తదితర అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తీర, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలని, అత్యవసరమని భావిస్తే తుపాను రక్షిత భవనాలకు తరలించి పునరావాసం కల్పించాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ పైలా రామారావు, సిఐ బి.తిరుమలరావు, జెడ్‌సి ఒమ్మి అయ్యప్పనాయుడు, ఎంపిడిఒ కెవి.నరసింహారావు పాల్గొన్నారు.

పొలాల గట్ల ద్వారా డ్రెయినేజీ

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పొలాల గట్లను తెగ్గొట్టడం ద్వారా పంట పొలాల్లోని వర్షపు నీరు బయటకు వెళ్తుందని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ రైతులకు సూచించారు. భీమిలి డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఎఒలతో కలిసి పర్యటించారు. ఈదురు గాలులు బలంగా వీచేటప్పుడు వరి చేను పడిపోయే అవకాశం ఉన్నందున వర్షపు నీరు బయటకు పోయేలా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు

జివిఎంసి 3, 4 వార్డుల పరిధిలో ఉన్న లోతట్టు ప్రాంతాల్లో తహశీల్దార్ పైలా రామారావు సిబ్బందితో కలిసి పర్యటించారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురైతే దగ్గర్లో ఉన్న సామాజిక భవనాలు, పాఠశాల భవనాలు, తుపాను రక్షిత భవనాలకు ప్రజలను తరలించాలని సంబంధిత గ్రామాల విఆర్‌ఒలకు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. 3, 4 వార్డుల పరిధిలో తోటవీధి, బోయి వీధి, ఎగువ పేట, చేపలుప్పాడ, మంగమారిపేట గ్రామాల్లో ఆయన పర్యటించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు కొక్కిరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు

తగరపువలస : తుపాను నేపథ్యంలో తీర ప్రాంతమైన భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం గ్రామాల్లో ఆర్‌డిఒ సంగీత్ మాధుర్, తహశీల్దార్ రామారావు పర్యటించారు. పూరి గుడిసెల్లో ఉండే ప్రజలను పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. నది తీర ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో సర్పంచ్ బొడ్డు దుర్గాలమ్మ, పంచాయతీ కార్యదర్శి జీవన్ రాణి, విఆర్‌ఒ కృష్ణ, బొడ్డు దుర్గారావు పాల్గొన్నారు.

తాళ్లవలస పంచాయతీలోని గ్రామాల్లో ఉద్యానవన అధికారులు పర్యటించి తుపానులో తోటల పెంపకం– రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యాన శాఖ అధికారి భాను పుష్పా లీలావతి వివరించారు.

టి.నగరపాలెం పంచాయతీలో గోస్తనీ నది ప్రవాహాన్ని ఆర్‌డిఒ సంగీత్ మాధుర్, తహశీల్దార్ రామారావు పరిశీలించారు. నది ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రమేష్ నాయుడు, సర్పంచ్ పొట్నూరు చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తుఫాన్ కారణంగా మత్స్యకారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. పూడిమడక సముద్రతీరంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో ఆయన మాట్లాడుతూ ముందు జాగ్రత్తగా వలలు, బోట్లు, ఇతర వేట సామాగ్రిని సురక్షితమైన ప్రదేశానికి తరలించాలని సూచించారు. సంబంధిత అధికారులు చెప్పేంతవరకు వేటకు ఎవరో వెళ్లరాదన్నారు. తహశీల్దారు, ఎంపీడీవో, మత్స్యశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. కార్యక్రమంలో మెరుగు బాపు నాయుడు ఎర్రిపల్లి కిరణ్, ప్రవీణ్, చేపల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : యలమంచిలి తహశీల్దార్ వరహాలరావు ఇరిగేషన్ ఎఇ ప్రేమ్ కుమార్ లోతట్టు ప్రాంతాలైన జంపపాలెం, సోమలింగపాలెం, గోకివాడ డ్యామ్, నర్సాపురం డ్యామ్ ప్రాంతాల్లో పర్యటించారు. యలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ సోమలింగపాలెం గ్రామంలో పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు.

దేవరాపల్లి : రైవాడ జలాశయాన్ని మండల తహశీల్దార్, లక్ష్మీదేవి, సబ్ ఇన్స్పెక్టర్ వి.సూర్యనారాయణ, డిఈ సత్యం నాయుడు సోమవారం పర్యవేక్షించారు. పర్యాటకులు ఎవరు జలాశయానికి రావొద్దని, మత్స్యకారులు చేపల వేట దిగొద్దని సూచిస్తూ జలాశయం వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ విషయమై అన్ని గ్రామ పంచాయతీల్లో దండోరాలు వేయించడం జరిగిందని వారు తెలిపారు.

సబ్బవరం : సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డులో బొర్రమ్మ గెడ్డ కాలవను అధికారులు పరిశీలించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్త చెదారాన్ని తొలగించి నీటి ప్రవాహం సజావుగా పోవుటకు ఏర్పాట్లు చేశారు. దీనికి ముందు తుఫాన్‌పై మండల స్థాయి అధికారులతో తహశీల్దారు బి.చిన్నికృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.పద్మజ, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : మండలంలోని సముద్రతీర ప్రాంత గ్రామాల్లో సోమవారం తహశీల్దారు ఎస్‌ఎ మహేశ్వరరావు పర్యటించారు. స్థానిక మత్స్యకారులతో మాట్లాడి తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ టి త్రినాధ్, టిడిపి నాయకులు చొక్కా వేణుగోపాలకృష్ణ, మోసా సతీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తుపాను నేపథ్యంలో పట్టణంలోని తాండవ నది పరివాహక ప్రాంతంలోని చాకలిపేటలో టిడిపి నాయకులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. బాధిత ప్రజలకు కోసం పాండురంగ స్వామి దేవస్థానం కళ్యాణ మండపం, చేనేత సొసైటీ కళ్యాణ మండపంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చింతలపు ప్రదీప్, యాళ్ల వరహాలబాబు, పెద్దిరెడ్డి చిట్టిబాబు, పెద్దిరెడ్డి శ్రీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని లోతట్టు ప్రాంత వై.తుని, జోగారావు పేట, పేరంటలుపాలెం గ్రామాలను మండల ప్రత్యేక అధికారి వి.లక్ష్మీ సుభాషిని, ఎంపీడీవో చంద్రశేఖరరావు, తహశీల్దారు తిరుమల రావు, సీఐ ఏ.స్వామి నాయుడు సందర్శించి ప్రజలకు తుఫాన్ తీవ్రత ప్రభావం తెలియజేశారు.



పూడిమడక తీరంలో అప్రమత్తం చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒలింపియాడ్‌కు కెకెఆర్ గౌతమ్ విద్యార్థులు





ప్రజాశక్తి– ఆనందపురం :మేథమెటిక్స్ టీచర్స్ అసోసియేషన్ (ఇండియా) ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైర్స్ ఇన్ మేథమెటిక్స్ పరీక్షల్లో కెకెఆర్.గౌతమ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి 2వ స్థాయి రీజినల్ మేథ్స్ ఒలింపియాడ్‌కు అర్హత సాధించినట్లు ఆ విద్యాసంస్థ డీన్ శేషుబాబు తెలిపారు. 10వ తరగతి బోని షాలిని (సిఐ విభాగం), బండారు జశ్వంత్ (సిఐ విభాగం) విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విద్యార్థులను స్కూల్ మేథ్స్ హెచ్‌ఒడి కెవిఆర్.మూర్తి, ప్రిన్సిపల్, ఫిజిక్స్ హెచ్‌ఒడి కెవిఆర్, కెమిస్ట్రీ హెచ్‌ఒడి వేణుగోపాల్ అభినందించారు.

నేరాలు ఘోరాలు



ఎసిబికి చిక్కిన జివిఎంసి ఆర్ఐ, సచివాలయ కార్యదర్శి

ఎసిబికి చిక్కిన ఆర్ఐ, సచివాలయ కార్యదర్శి

ప్రజాశక్తి –తగరపువలస : ఇంటి యాజమాన్య హక్కు పేరును మార్పుచేసి పన్ను వేసేందుకు లంచం తీసుకుంటూ జివిఎంసి జోన్–1 రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ముగడ రాజు, తగరపువలస బొగ్గు రోడ్డు –1 సచివాలయ కార్యదర్శి వై.స్వామినాయుడు సోమవారం సాయంత్రం ఎసిబికి పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఎసిబి డిఎస్‌పి వివిఎస్ఎస్.రమణమూర్తి కథనం ప్రకారం... చిట్టివలస గ్రామానికి చెందిన బాధితుడి తాత పేరుతో ఉన్న భవనానికి యాజమాన్య హక్కు పేరు మార్పుచేసి పన్ను వేయడం కోసం జివిఎంసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ముగడ రాజును, సచివాలయ కార్యదర్శి స్వామినాయుడును కలిశారు. ఈ పని నిమిత్తం వారిద్దరూ రూ.60 లంచం డిమాండ్‌చేశారు. బాధితుడు చాలా రోజులు అధికారుల చుట్టూ తిరిగినా లంచం లేనిదే పని కాదని అర్థమైంది. డబ్బులు ఇవ్వలేని పరిస్థితుల్లో ఎసిబి అధికారులను బాధితుడు ఈ నెల 24వ తేదీన ఆశ్రయించాడు. ఎసిబి అధికారుల ప్లాన్ ప్రకారం... బాధితుడు ముందుగా రూ.30 వేలు పట్టుకుని సచివాలయానికి వెళ్లాడు. సెక్రటరీకి రూ.30 వేలు ఇస్తుండగా అప్పటికే అక్కడ ఉన్న ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ, ఎవరైనా లంచం అడిగితే 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ దాడుల్లో ఎసిబి ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణరావు, సుప్రియ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దొంగనోట్ల ముఠా కేసులో మరో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : మూడు రోజుల క్రితం దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు చేసిన ఎంవిపి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మరో ముందడుగు వేశారు. ఈ కేసులో మధ్యప్రదేశ్‌కు చెందిన శ్రీరామ్‌ను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా తాజాగా పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితులను సోమవారం పట్టుకున్నారు.. ఈ కేసు వివరాలను విలేకరుల సమావేశంలో ద్వారక ఎసిపి అన్నెపు నరసింహమూర్తి వెల్లడించారు. ఎంవిపి.కాలనీలోని మారుతి అపార్టుమెంట్‌లో నివాసముంటున్న పాల వరప్రసాద్, సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన కొత్త ఆనంద్, రామగిరి మండలం సిద్ధగుంటపల్లి గ్రామానికి చెందిన కొప్పుల గంగాధర్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వీరిలో ఆనంద్, గంగాధర్‌లపై ఇప్పటికే రౌడీ షీట్లు ఉన్నాయన్నారు. సమావేశంలో పోలీసాధికారులు ప్రసాద్, ధనుంజయ నాయుడు పాల్గొన్నారు.

తైక్వాండోలో కెజిబివి విద్యార్థినికి రజతం



కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి– ఆనందపురం : ఆనందపురం మండలం నేలతేరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కెజిబివి)లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.ధనలక్ష్మి రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–19 తైక్వాండో పోటీల్లో 40 కిలోల విభాగంలో ధనలక్ష్మి అద్భుత ప్రదర్శన కనబరిచి రజత పతకం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు బి. రమాదేవి తెలిపారు. ధనలక్ష్మిని పాఠశాల ఇన్‌ఛార్జి జి.శీలా, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ శివాజీ, ప్రజా సంకల్ప వేదిక ఉత్తరాంధ్ర రీజనల్ ఇంచార్జ్ బి. బంగార్రాజు, వైస్ ఛైర్మన్ ఒ.మంగఅప్పన్న, కో–ఆప్షన్ మెంబర్ అక్కిరెడ్డి దేవుడుబాబు తదితరులు అభినందించారు.

అంబేద్కర్‌వాది పావనమూర్తి మృతి



ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ అంబేద్కర్ వాది చింతకాయల పావనమూర్తి (93) సోమవారం ఉదయం సీతమ్మధారలోని అంబేద్కర్‌నగర్‌లో కన్నుమూసారు. నగరంలోని రామాటాకీస్ సమీపంలో అంబేద్కర్ భవన్‌ను స్థాపించిన వారిలో ప్రముఖులు. బిఆర్.అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి సుదీర్ఘ కాలం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సామాజిక సిద్ధాంతాన్ని విస్తృతం చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారు. సర్వ మానవ సమానత్వాన్ని కోరిన బుద్ధిజం అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆయన ఎంతో కృషిచేశారు. రాష్ట్రంలో బుద్ధిజం వ్యాప్తి చేయడం కోసం బుద్ధిష్టి సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ స్థాపించి దానికి ఆయన ప్రథమ అధ్యక్షునిగా పనిచేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌ను దళిత, బహుజన ఉద్యమాల కేంద్రంగా మార్చి దళిత హక్కులు, సామాజిక న్యాయం, రిజర్వేషన్ల పరిరక్షణ సాధన కోసం ఎంతగానో కృషిచేశారు. ఆంధ్ర యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగంలో అధ్యాపకునిగా సేవలందించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు. మంగళవారం ఉదయం10 గంటలకు కెఆర్ఎం కాలనీలోని శ్మశాన వాటికలో ఆయన పార్థివ దేహానికి అంత్యక్రియలు జరపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



మానవేంద్రనాథ్‌రాయ్‌ను కలిసిన గాజువాక న్యాయవాదులు

మానవేంద్రనాథ్‌రాయ్‌ని కలిసిన గాజువాక న్యాయవాదులు

ప్రజాశక్తి -గాజువాక : హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌రాయ్‌ను గాజువాక న్యాయవాదులు సోమవారం విజయవాడలో కలిశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై న్యాయమూర్తిని అభినందించారు. గుజరాత్ రాష్ట్రం నుంచి బదిలీపై వచ్చిన మానవేంద్రనాథ్‌రాయ్‌ను గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షులు యశోదర వేదమని, సీనియర్ న్యాయవాదులు బి మురళీకృష్ణరాజు, వెన్నెల ఈశ్వరరావు, సత్యవాణి, శాంతి, విశ్వనాథ రమణ ఉన్నారు.

'మెనోపాజ్ ముగింపు కాదు'

ప్రజాశక్తి-మధురవాడ : స్త్రీలలో సహజంగా 45 సంవత్సరాల అనంతరం శరీరంలో వచ్చే మార్పులు ముఖ్యంగా మెనోపాజ్ దశలో ఎదురయ్యే సమస్యలపై అక్టోబర్ నెల చివరి వరకు పలు అవగాహనా కార్యక్రమాలు, ప్రత్యేకవైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గీతం ఆసుపత్రి గైనకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.గీతాకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మెనోపాజ్ గురించి వివరిస్తూ, దేశంలో చాలా మంది మహిళలు సుమారు 46 ఏళ్ల వయసులో మెనోపాజ్ దశను చేరుకుంటారని, ముఖ్యంగా భారతదేశంలో మెనోపాజ్ అనంతరం జీవించే మహిళల సంఖ్య వేగంగా పెరుగుతోందని, 2026 నాటికి ఇది సుమారు 10.3 కోట్లు ఉంటుందని అంచనా కాగా వీరిలో సుమారు 33.1 శాతం మహిళలకు ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత) సమస్య ఉంటుందని వెల్లడించారు. అండాశయ పనితీరు తగ్గడం, ఈస్ట్రోజెన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గడం వల్ల నెలసరి ఆగిపోతుందని తెలిపారు. ఈ రుతువిరతి అనేది కొన్ని భావోద్వేగ, శారీరక లక్షణాలతో ముడిపడి ఉంటుందని, సహజంగా రాత్రి చెమటలు పట్టడం, మానసిక ఆందోళన వంటివి సాధారణంగా ఉత్పన్నమవుతాయని వివరించారు. గీతం ఆసుపత్రిలో ప్రతి నెలా సుమారు 1800 గైనిక్ సమస్యలతో మహిళలు వస్తుండగా వారిలో సుమారు 60 శాతం మహిళలు మెనోపాజ్ తర్వాతి లక్షణాలతో బాధపడుతున్నారని, నిపుణులైన వైద్యుల సమర్థతతో చికిత్స పొందిన వారిలో 55 శాతం మంది మళ్లీ ఆరోగ్యం, ఉత్సాహం, ఆనందాన్ని పొందారని వెల్లడించారు.

ప్రతిరోజూ వ్యాయామం, సూర్యకాంతి శరీరంపై పడేలా చూసుకోవడం, ఎముకల పరీక్షల ద్వారా ఆస్టియోపోరోసిస్ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ నెల చివరి వరకు గీతంలోని తమ విభాగంలో స్త్రీలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని, లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బిఎ1సి, రీనల్ ఫంక్షన్ టెస్టులు, బోన్ మినరల్ డెన్సిటీ టెస్ట్, నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రహదారి గుంతలమయం

వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమునిపట్నం మండలంలోని అమానం గ్రామం రహదారి గుంతలమయంగా ఉంది. ఈ రహదారిపై ప్రయాణానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖపట్నం జిల్లాకు సరిహద్దు చివరి ప్రాంతంగా ఈ గ్రామం ఉంది. ఎన్‌హెచ్-5 నుండి అమనాం గ్రామం సుమారుగా మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇరుకైన రహదారికితోడు అంతా గుంతలమయం కావడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయభ్రాంతులకు



గతుకుల రహదారి

గురవుతున్నారు. గ్రామానికి అటువైపు విజయనగరం జిల్లాకు రావాడ గ్రామం ఉంది. ఆ గ్రామస్తులు కూడా ఇదే రహదారిలో ప్రయాణం సాగిస్తారు. అవంతి కాలేజీ, స్కూల్ బస్సులు, దివీస్ ఉద్యోగులు, ప్రజలు ఈ రోడ్డుగుండానే ప్రయాణం సాగిస్తారు. అమనాం గ్రామం నుండి విశాఖ పట్టణానికి రోజుకు ఆర్‌టిసి బస్సు మూడు ట్రిప్పులు తిరుగుతుంది. ఈ రోడ్డు గుండా ప్రయాణించిన ద్విచక్ర వాహనాలు నిత్యమూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ రోడ్డు భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రోడ్డుకు అనుసంధానం కలిగి ఉంది. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చెయ్యాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య సిబ్బంది సెలవులు పెట్టరాదు

డిఎంహెచ్ఒ జగదీశ్వరరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : మొంథా తుపాను నేపథ్యంలో ఆరోగ్య సిబ్బంది ఎవరూ సెలవులు పెట్టరాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. తుపాను కారణంగా విశాఖపట్నం పరిధిలోని 54 హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు, 66 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను, ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. ముందుగా తమ ఏరియాలలో గల మంచినీటి వనరులను బ్లీచింగ్ చేయాలని, అత్యవసర మందులు అన్ని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య సిబ్బందిని ఈ మూడు రోజులు 24 గంటల డ్యూటీ వేయాలని వైద్యాదికారులను ఆదేశించారు. అందరూ ఐవి ఫ్లూయిడ్స్, పాము, కుక్కకాటు మందులు, యాంటీ బయాటిక్స్, అన్ని డయాగ్నొస్టిక్స్ కిట్స్ అందుబాటులో ఉంచుకోవాలని, గర్భిణీ స్త్రీల ఇడిడిల ప్రకారం దగ్గరలోని ఆసుపత్రిలో ఉంచాలని తెలిపారు. మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటుచేస్తూ ఒక డాక్టర్, ఒక సీనియర్ నర్స్, ఇద్దరు పారామెడికల్ సిబ్బంది ఉండాలని చెప్పారు. ఏడు 104 వాహనాలు, పదహారు 108 వాహనాలు, ఇరవై మూడు 102 తల్లి బిడ్డ వాహనాలను తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఫిషెర్‌మెన్ డిపార్టుమెంటుతో కలిసి బోట్ క్లీనిక్స్‌గా ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాగల 72 గంటల వరకు ఎలక్ట్రిసిటీ, ఇందనం నిల్వలు చూసుకోవాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఎపిడమిక్ విభాగం 24 గంటలు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఎదురయ్యే సమస్యలపై జిల్లా సర్వేలేన్ అధికారి డాక్టర్ జగదీశ్ ప్రసాద్ (9993489519), పి.శ్యాంప్రసాద్ (9493426612)ను సంప్రదించాలని సూచించారు.



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

విద్యావేత్తకు సన్మానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : దాదాపు 15 ఏళ్లుగా వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న స్థానిక సన్ స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాస్‌ను విశాఖ ఎంపి శ్రీభరత్ సోమవారం సన్మానించారు. ఓ స్వచ్ఛంద సంస్థ 'ఎడ్యు ఐ కాన్' పేరిట నగరంలోని ఓ హోటల్‌లో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురు విద్యావేత్తలను సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా శ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. రక్తదాన శిబిరాలు, నేత్ర వైద్య శిబిరాలు, ఉచితంగా కళ్లజోళ్లపంపిణీ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేసినందుకుగాను అవార్డు అందుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.కృష్ణారెడ్డి, ఎంవి.రావు తదితరులు పాల్గొన్నారు.

"కూటమి' పాలనలో రాష్ట్రం సర్వనాశనం'

ప్రజాశక్తి- గాజువాక : కూటమి ప్రభుత్వ పాలనలో రూ.2 లక్షల కోట్లు అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని వైఎస్ఆర్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు పి.గౌతమిరెడ్డి ఆరోపించారు. గాజువాకలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం దుర్మార్గ పాలన చేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను, కార్మికులను, ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేస్తుందన్నారు. అన్ని సంక్షేమ పథకాలను ఆటకెక్కించారని విమర్శించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు మాట్లాడుతూ, పేదలకు విద్య, వైద్యం అందకుండా చేశారన్నారు. పాలన చేతగాక ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టి పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. అధికారం లేనప్పుడు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకుంటామని చెప్పారని, దీన్ని నమ్మి ప్రజలు విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఇప్పుడు ప్లాంట్ నిర్వీర్యానికి పూర్తిగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఓట్లు వేసినందుకు కార్మికులపై ఎదురు దాడిచేస్తూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. వైసిపి గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ, కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే నడపాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్‌టియుసి జోనల్ ఇన్‌ఛార్జి పివి.సురేష్, జిల్లా అధ్యక్షులు రాయపు అనిల్ కుమార్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా చిన్నతల్లి, మార్టుపూడి పరదేశి పాల్గొన్నారు.

దేశ సాంస్కృతిక సంపద ఆదర్శనీయం : సిపి

ప్రజాశక్తి-సీతమ్మధార : మన దేశ సాంస్కృతిక సంపద ఆదర్శనీయమైనదని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. సీతమ్మధారలోని ఎపిఎస్ఇబి.కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్లో స్కూల్ ఆఫ్ థియేటర్స్, ప్రజాపిత బ్రహ్మకుమారీశ్వర్య విశ్వవిద్యాలయం సంయుక్తంగా సోమవారం జాతీయ కళాకారుల సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, కళాకారుల ప్రతిభకు ఎల్లలు ఉండవన్నారు. విశ్వ సమైక్యతకు కళాకారులే వారధులు అని పేర్కొన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, జానపద కళారూపాలను పరిరక్షించుకునే బాధ్యత అందరిదీ అన్నారు. బిజెపి నాయకులు బాగాది శ్యామల మాట్లాడుతూ, సంప్రదాయ కళలు విశ్వఖ్యాతిని అర్జిస్తున్నాయన్నారు. ఇంటర్నేషనల్ వాకర్స్ అవార్డు గ్రహీత డాక్టర్ కమల్ బెయిడ్ మాట్లాడుతూ, విశాఖలో క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభావంతులకు కొదవ లేదన్నారు. విశాఖ జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విశాఖలో సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రభుత్వ వేదిక అవసరం ఉందన్నారు. బ్రహ్మ కుమారి రామేశ్వరి, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ అంతర్జాతీయ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్ మాట్లాడుతూ విశాఖలో విభిన్న దేశాల జానపదనృత్య సమ్మేళనం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వెస్ట్ బెంగాల్, విశాఖపట్నం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో కొండ్రు రామారావు, బి.గురునాధరావు, ప్రవల్లిక నాయుడు, కుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వెస్ట్‌బెంగాల్, విశాఖ కళాకారులు జానపద నృత్యాలు ప్రదర్శించారు.



కళాకారులను సత్కరించిన పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి తదితరులు

విజయ మెడికల్‌తో 'న్యూబెర్గ్' భాగస్వామ్యం

ప్రజాశక్తి - ఆరిలోవ : న్యూబెర్గ్ డయాగ్నోస్టిక్స్, వైజాగ్‌లోని విజయ మెడికల్ సెంటర్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం చేసుకున్నట్లు న్యూబెర్గ్ డయాగ్నోస్టిక్స్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జిఎస్‌కె.వేలు, విజయ మెడికల్ సెంటర్ డైరెక్టర్, రేడియాలజీ చీఫ్ డాక్టర్ సుమన్ కలగర తెలిపారు. విజయ మెడికల్ సెంటర్ 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆరిలోవ హెల్త్‌సిటీలోని విజయ మెడికల్ సెంటర్ ప్రధాన కార్యాలయంలో ఈ భాగస్వామ్య ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జిఎస్‌కె.వేలు, డాక్టర్ సుమన్ కలగర మాట్లాడుతూ, విజయ మెడికల్ సెంటర్‌తో న్యూబెర్గ్ డయాగ్నోస్టిక్స్ భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించిందన్నారు. ఈ భాగస్వామ్యం తెలుగు రాష్ట్రాల్లో న్యూబెర్గ్ కార్యకలాపాలను విస్తృతం చేస్తుందన్నారు. పాథాలజీ, రేడియాలజీ, నివారణ ఆరోగ్య సేవలను వేగవంతమైన, ఖచ్చితమైన, నమ్మదగిన ఫలితాల నుండి రోగులు ప్రయోజనం పొందేలా ఏకీకరణ చేస్తుందన్నారు. ఈ నూతన ఒప్పందం ప్రకారం పునరుత్పత్తి, వారసత్వ జన్యుశాస్త్రం, ఆంకాలజీ, పాథాలజీ ట్రాన్స్‌ప్లాంట్ ఇమ్యూనాలజీ, జినోమిక్స్, ప్రోటీమిక్స్, రిటైల్ హెల్త్ చెక్ అప్‌లతో సహా అధునాతన మాలిక్యులర్, జెనెటిక్ టెస్టింగ్ సామర్థ్యాలను న్యూబెర్గ్ పరిచయం చేయనుందని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యూబెర్గ్ డయాగ్నోస్టిక్స్ ప్రతినిధులు సందీప్‌షా, శ్రీగణేశన్, కావ్య, విజయ మెడికల్ సెంటర్ డైరెక్టర్లు డాక్టర్ మదన్ కలగర, డాక్టర్ సూర్యనారాయణ కొప్పాక, డాక్టర్ సత్యనారాయణ ఎంటివివి తదితరులు పాల్గొన్నారు.

తీర, ముంపు ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తత

ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం

తుపాను జిల్లా ప్రత్యేక అధికారి వి.వినయ్ చంద్

ప్రజాశక్తి-అనకాపల్లి

మొంథా తుఫాను కారణంగా ప్రభావితమయ్యే తీర, నదీపరివాహక, ఇతర ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తుఫాను జిల్లా ప్రత్యేక అధికారి వి.వినయ్ చంద్ ఆదేశించారు. మొంథా తుఫాను ముందస్తు జాగ్రత్త చర్యలు, ఏర్పాట్లపై సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హాతో కలిసి జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో వినయ్ చంద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను 28న మధ్యాహ్నం నాటికి తీరం దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రతి ఉద్యోగి వారి కార్యస్థానంలోనే ఉండాలని ఆదేశించారు. తుపాను ముందస్తు రక్షణ చర్యలలో అశ్రద్ధ వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శిథిలమైన, పాడుబడిన, వర్షాలకు నానిపోయి కూలిపోయేందుకు అవకాశం ఉన్న గృహాల్లో నివశిస్తున్న వారిని ముందుగానే సురక్షిత భవనాల్లోకి తరలించాలని ఆదేశించారు. ఎక్కడైనా కరెంటు స్తంభాలు విరిగిపోతే వెంటనే మార్చాలని, విద్యుత్ పునరుద్ధరణ చేయాలని సూచించారు. రిజర్వాయర్ల నుండి నీటిని విడుదల చేసినప్పుడు ముందుగానే సమాచారం అందించాలని, దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. పొంగిపొర్లే వాగులు, వంకలను ప్రజలు దాటకుండా నిరోధించాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం పాయకరావుపేటలోనూ, ఎన్‌డిఆర్‌ఎఫ్ బందం జిల్లా కేంద్రంలోనూ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగకుండా ముందస్తు చర్యలు : కలెక్టర్

అనకాపల్లి : మొంథా తుఫాను కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, జెసి ఎం.జాహ్నవితో కలిసి జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లు సదుపాయం లేని 62 గిరిజన గ్రామాల ప్రజలను దగ్గరలో గల మైదాన ప్రాంతానికి తరలించాలని, అక్కడ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలో వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని సూచించారు. 108, 104, 102 వాహనాల వివరాలు, వైద్య సిబ్బంది మెబైల్ నెంబర్లు వివరాలు కంట్రోల్ రూంలో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తుపాన్ ప్రత్యేకాధికారి వినయ్ చంద్, చిత్రంలో కలెక్టర్, ఎస్‌పి

జిల్లాలో 74 తుపాను పునరావాస కేంద్రాలు

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో 74 తుఫాను పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసారు. చోవవరం మండలంలో 4, యలమంచిలిలో 1, సబ్బవరంలో 2, పరవాడలో 3, మాడుగులలో 2, నక్కపల్లిలో 10, గొలుగొండలో 1, చీడికాడలో 2, మాకవరపాలెంలో 1, కశింకోటలో 2, దేవరాపల్లిలో 2, అచ్చుతాపురంలో 2, అనకాపల్లిలో 1, మునగపాకలో 3, నాతవరంలో 2, ఎస్.రాయవరంలో 5, కె.కోటపాడులో 2, రోలుగుంటలో 1, నర్సీపట్నంలో 3, బుచ్చెయ్యపేటలో 2, కోటవురట్లలో 3, రావికమతంలో 4, రాంబిల్లిలో 5, పాయకరావుపేట మండలంలో 11 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పాయకరావుపేట : మండలంలో తుఫాను బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సోమవారం నర్సీపట్నం ఆర్డీవో, తహశీల్దారు మహేశ్వరరావు, స్పెషల్ ఆఫీసరు, సిఐ అప్పన్న పరిశీలించారు. తుఫాన్ షెల్టర్ జోన్స్ అయిన గవర్నమెంట్ హైస్కూల్, ఇందిరా కాలనీ, కనోస ఇంగ్లీష్ మీడియం స్కూలు, సమయమంతుల రెడ్డి గవర్నమెంట్ హైస్కూల్, జడ్పీ గర్ల్స్ హైస్కూల్, శ్రీపాండురంగ స్వామి కళ్యాణ మండపంలలో విజిట్ చేసి నిర్వాసితులకు భోజనాలు, వసతి ఏర్పాట్లు చేశారు.


పాయకరావుపేటలో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సైక్లోన్ సెంటర్‌ను సందర్శించిన ఎస్‌పి

పరవాడ : జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలోని సైక్లోన్ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. తుఫాన్ సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానంపై, సెంటర్‌లో అవసరమైన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, సహాయక బృందాల సమన్వయంపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట డీఎస్పీ విష్ణు స్వరూప్, సిఐ మల్లికార్జునరావు ఉన్నారు.

అధికారులతో ప్రత్యేకాధికారి సమీక్ష

అచ్యుతాపురం : మొంథా తుపాన్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్ చంద్ అచ్చుతాపురం తహశీల్దారు కార్యాలయంలో అధికారులతో తుఫాన్‌పై సమీక్షించారు. తీర ప్రాంత గ్రామాల్లో ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు తెలియజేయాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా నియంత్రించాలన్నారు ఈ సమావేశంలో అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మొంథా తుపాన్ పునరావాస కేంద్రాలుగా వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజయరామరాజుపేట జడ్పీ హైస్కూల్‌ను కేటాయించినట్లు బుచ్చియ్యపేట తహసీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. సహాయక సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. బుచ్చియ్యపేట తహసీల్దార్లో కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సహాయం కోసం 08934294391 నెంబర్‌ని సంప్రదించాలని సూచించారు.

అనకాపల్లి : మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా ప్రజలు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ వలన ఎటువంటి ప్రాణనష్టం జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తుపాన్ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో సహాయ సహకారాలు అందించేందుకు కూటమి నాయకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం

పేదలను ఆదుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి- అనకాపల్లి : మొంథా తుఫాను వలన పేదలు ఇంటి నుండి బయటకు వెళ్లే పరిస్థితి లేక ఉపాధి కోల్పోతాయరని, ప్రభుత్వం తక్షణమే ప్రతి కుటుంబానికి నిత్యవసర సరుకులు సరఫరా చేసి ఆదుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.మాణిక్యం, డిడి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక కర్షక భవనంతో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెల్ల రేషను కార్డు ఉన్నవారి అకౌంట్లో ప్రతి కుటుంబానికి రూ.10వేలు ఆర్థికంగా సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు సిహెచ్ మంగతాయారు, బి.వాణి, ఎం తార తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన ఎం.సత్యనారాయణ కుటుంబానికి సోమవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న హోం గార్డులు తమ ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను స్వచ్ఛందంగా విరాళంగా ఇవ్వడం ద్వారా, ఇతర ఆర్థిక సాయం కలిపి మొత్తం రూ.3,98,610 చెక్కును జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో మరణించిన హెూం గార్డు భార్య వెంకటలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సత్యనారాయణ కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని తెలిపారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న హెూం గార్డులు విధి నిర్వహణలో మరణించినా లేదా పదవీ విరమణ పొందినా వారికి ఆర్థిక సహాయం అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటారని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ఎడతెరిపిలేని వర్షం


కోటవురట్లలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-కోటవురట్ల : మొంథా తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా సోమవారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు ప్రధానంగా రైతులు పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారులు లోతట్టు ప్రాంతాలను పరిశీలించడంతోపాటు చెరువులు నది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

బుచ్చయ్యపేట : సోమవారం ఉదయం నుండి మండలంలో వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పంట పొలాల్లో అధికంగా నీరు చేరింది. గ్రామాల్లో వీధులన్నీ జలమయమయ్యాయి. ఏమాత్రం ఈదురు గాలులు వేసిన చెరకు పంట నేలకొరిగే అవకాశం ఉంది. వరి పంట పొట్ట దశలో ఉండడంతో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముంది. దీంతో వరి, చెరకు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

యలమంచిలి : ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పట్టణ ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణ రోడ్లు జనం లేక బోసిపోయి కనిపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చిత్తడిగా మారాయి.

సీతమ్మధార : నగరంలో భారీ వర్షాల కారణంగా జివిఎంసి 25, 26, 27, 42, 43,45 వార్డుల పరిధిలోని గెడ్డల్లో నీరు పొంగి రోడ్డుపైకి వచ్చి చేరింది. శంకరమఠం, అక్కయ్యపాలెం జ్ఞానికేతన్ స్కూల్ రహదారులు పూర్తిగా చెరువును తలపించేలా మారాయి. రహదారులపై నీటి ప్రవాహంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల చెట్ల విరిగిపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

గొలుగొండ : మొంథాతుపాన్ కారణంగా గొలుగొండ మండల వ్యాప్తంగా సోమవారం ముసురు వాతావరణం అలుముకుంది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉదయం చిన్న పాటి చినుకులు పడినప్పటికీ, సాయంత్రం నుంచి మోస్తరు వర్షం కురిసింది.

రహదారులు జలమయం

ములగాడ : మొంథా తుపానుకు సోమవారం మల్కాపురంలో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎకెసి.కాలనీ జంక్షన్ నుండి మల్కాపురం వెళ్లే మెయిన్ రోడ్డు మొత్తం మోకాళ్ల లోతులో నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు ట్రాఫిక్ సిఐతో కలిసి అక్కడకు చేరుకొని అడ్డుగా ఉన్న రోడ్డు డివైడర్‌ను జివిఎంసి సిబ్బంది సహాయంతో తొలగించారు. దీంతో రోడ్డుపై ఉన్న నీరు పల్లపు ప్రాంతానికి వెళ్లడంతో రాకపోకలు కొనసాగాయి.

అనకాపల్లి జిల్లాలో వర్షపాతం

అనకాపల్లి రూరల్ : మొంథా తుపాన్ కారణంగా సోమవారం ఒకే రోజులో అధిక మొత్తంలో వర్ష పాతం నమోదైంది. పరవాడలో అత్యధికంగా 66.8 మీల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సబ్బవరంలో 61.2 మీల్లీమీటర్లు, రాంబిల్లిలో 55 మీల్లీమీటర్లు, మునగపాకలో 49.8 మీల్లీమీటర్లు, అచ్చుతాపురంలో 49.2 మీల్లీమీటర్లు, అనకాపల్లిలో 47.2 మీల్లీమీటర్లు, దేవరాపల్లి మండలంలో 17.6 మీల్లీమీటర్లు వర్షం కురిసింది. జిల్లా మొత్తం సరాసరిగా 36.9 మీల్లీమీటర్లు, వర్షపాతం నమోదైంది.


ఎకెసి కాలనీ, మల్కాపురం రోడ్డులో చేరిన వర్షపు నీరు

అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్‌తో భూ కబ్జాదారులకే మేలు

ఎపి వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని త్వరలోనే తొలగించి రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామని ఈనెల 24న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం ప్రకటించడాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తప్పుబట్టారు. ఇది పూర్తిగా భూ కబ్జా దారులకు తీపికబురు అవుతుందని, లక్షలాది మంది దళిత, గిరిజనులకు, బలహీనవర్గాలకు చేదుకబురు అవుతుందని పేర్కొన్నారు. అసైన్డ్ భూములను పలుకుబడి కలిగిన పెద్దలకు కట్టబెట్టడానికే ఈ ఫ్రీ హోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తున్నారని విమర్శించారు. 2023లో నాటి ప్రభుత్వం 50 ఏళ్లలో అసైన్డ్ భూములు పొందిన పేదలు 20 ఏళ్ళు అనుభవించిన తర్వాత అమ్మాకాలకు కొనుగోలుకు అవకాశం కల్పిస్తూ 9/77 చట్టాన్ని సవరించిందని తెలిపారు. దీనిని నాడు వ్యవసాయ కార్మిక సంఘం, సామాజిక స్వచ్ఛంద సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించి పెద్ద ఎత్తున పోరాటం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములపై సమగ్రంగా విచారణ జరిపి ఆక్రమణలను స్వాధీనం చేసుకొని పేదలకు అప్పగిస్తామని నాడు చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. నేడు అందుకు భిన్నంగా రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ఎకరం కూడా అర్హుల చేతుల్లో నుండి భూమిని తీసుకొని పేదలకు ఇచ్చిన దాఖలాల్లేవని పేర్కొన్నారు. అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా ఉన్న 9/77 చట్టాన్ని యథా ప్రకారంగా అమలు చేసి అనర్హుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను తిరిగి దళిత, గిరిజన బలహీన వర్గాల పేదలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎత్తున ఆందోళన చేస్తామని వెంకన్న హెచ్చరించారు.



ప్రతిభ కనబర్చిన శ్రీప్రకాష్ విద్యార్థులు

పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ

ప్రజాశక్తి-పాయకరావుపేట : శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల (అటానమస్) బీఎస్సీ అగ్రికల్చర్, రూరల్ డెవలప్మెంట్ ప్రథమ సంవత్సర విద్యార్థినులు టి.వైష్ణవి, కె.షైనీ, ఎమ్.రమ్య , ఎస్.శ్యామల, ఎం.శృతి, పి.శరణ్యల బృందం విశాఖపట్నంలో ఈ నెల 24 నుండి 26 వరకు జరిగిన విశాఖ లైఫ్ సైన్స్ సింపోజియం (వీఎల్ఎస్ఈ)-2025 పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. బయో ఎడ్సార్బెంట్ ఫిల్ట్రేషన్ సిస్టమ్‌పై వారు తయారు చేసిన పరికరంపై ప్రెజెంటేషన్ ఇచ్చి, ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ బయాలజీ శాస్త్రవేత్త, భారత ప్రభుత్వ శాంతిస్వరూప్ భట్నాగర్ పురస్కార గ్రహీత డాక్టర్ ఉందుర్తి నరసింహ దాస్ చేతుల మీదుగా బహుమతిని, నగదు పురస్కారాన్ని అందుకున్నారు. టీక్యాబ్స్ నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు పాల్గొనగా తమ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం ఆనందదాయకమని విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు అన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినులను విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నారపాడు పంచాయతీ నారపాడు గ్రామానికి చెందిన నరవ అప్పలరాజు (45) ఈనెల 26 ఆదివారం చెరువులో కాలుజారిపడి మునిగిపోయి గల్లంతయ్యారు. గ్రామస్తులు సోమవారం చెరువులో గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ విషయమై మృతుని బంధువులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా స్థానిక సిఐ జి. రామచంద్రరావు మృతదేహన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొజ్జన్న కొండ పరిరక్షణకు సిబ్బందిని నియమించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండకు వచ్చే పర్యాటకుల భద్రత, పవిత్రతలకు, శిల్ప కళాసంపదలకు రక్షణ కల్పించేలా తగిన చర్యలు చేపట్టేందుకు తగిన సిబ్బందిని నియమించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు ఆర్కియాలజీ అధికారులకు, జిల్లా కలెక్టరు విజయకృష్ణన్‌కు లేఖ రాశారు. అతి ప్రాచీన చరిత్ర కలిగిన ప్రముఖ బౌద్ధ పర్యాటక క్షేత్రానికి ప్రతి ఏటా కార్తీకమాస ప్రారంభం మొదలు కొని సంక్రాంతి, కనుమపండుగ తీర్థం వరకు నిత్యమూ అనేక వేలమంది పర్యాటకులు వస్తారని తెలిపారు. వేలాదిగా తరలి వచ్చే పర్యాటకుల భద్రత దృష్ట్యా తగిన సిబ్బందిని నియమించాలని కోరారు.

పాఠశాలలో శ్రమదానం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం మొగలిపురం జనసేన పార్టీ అధ్యక్షులు తమరాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మేడపాటి రాము ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు శ్రమదానం చేశారు. పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించి చెత్తను ఎత్తివేసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గండి కిషోర్‌మోహన్ కుమార్, బైలపూడి లక్ష్మణ, వంశీ, నర్సింగరావు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న జనసేన కార్యకర్తలు

వైసిపి సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ : ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దుర్మార్గమని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. సోమవారం గొలుగొండ మండలం సిహెచ్.ఎర్రవరం పంచాయతీలో వైసిపి కోటి సంతకాలు సేకరణ చేపట్టారు ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం వల్ల జరిగే నష్టాలు ప్రజలకు వివరించి, సంతకాల సేకరణ చేపట్టారు. సేకరించిన సంతకాల ప్రతులను రాష్ట్ర గవర్నర్‌కు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని, పేదలకు వైద్యవిద్యను దూరంచేసే చర్యలు వీడాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో తీవ్ర ప్రతిఘటన తప్పదని, ప్రజలే తగిన బుద్దిచెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కొరుప్రోలు ఫాణి శాంతారామ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం లింగంపేట పంచాయతీ సర్పంచ్ తోకల సంతోష్ తండ్రి తోకల అప్పలనాయుడు పెద్దకర్మ సందర్భంగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

అచ్యుతాపురం : సూపర్ సిక్స్ పేరుతో కూటమి నేతలు ప్రజలను నమ్మించి మోసగించారని వైసిపి ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా ఎస్సీ జెడ్ పునరావస కాలనీలో ఆదివారం రాత్రి ప్రజలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వరి పంటకు కావలసిన యూరియా సకాలంలో ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, సీనియర్ నాయకులు కోన లచ్చన్న నాయుడు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు నర్మల కుమార్, ఎంపీటీసీ సభ్యుడు శనివాడ జువాల నాయుడు, లాలం శ్రీనివాసరావు, నీరుకొండ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి నాయకులు సోమవారం వేములవలసలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వేములవలస మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ కమిటీ నాయకులు శినగం సత్యనారాయణ, కోరాడ రాజారావు, పతివాడ రాజు, కడగళ్ల నారాయణరావు, దొంతల గోపీకృష్ణ, ఉప్పాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ గ్రౌండ్‌లో క్లీనింగ్



గ్రౌండ్‌ను దగ్గరుండి క్లీనింగ్ చేయిస్తున్న జోనల్ కమిషనర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్టీఆర్ గ్రౌండ్‌ను శుభ్రం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు ఆదివారం డిమాండ్ చేసిన వార్త సోమవారం ప్రజాశక్తిలో ప్రచురణ కావడంతో అధికారులు స్పందించారు. జోనల్ కమిషనర్ చక్రవర్తి దగ్గరుండి సిబ్బందితో గ్రౌండ్‌ను శుభ్రం చేయించారు. ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్లో ప్రతిరోజు క్రీడాకారులు, వాకర్స్, విద్యార్థులు నిత్యం తమ కార్యకలాపాలు కొనసాగిస్తారు. ఈ నేపథ్యంలో దీపావళి పండగను పురస్కరించుకొని గ్రౌండ్లో బాణసంచా సామాగ్రి విక్రయించేందుకు జీవీఎంసీ అధికారులు అనుమతించారు. దీపావళి వెళ్లి ఐదు రోజులు కావస్తున్న ఎక్కడ చెత్త అక్కడే ఉండిపోవడంతో క్రీడాకారులు, వాకర్స్, విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. దీనిపై సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్ రావు, ఉపాధ్యక్షులు గంట శ్రీరామ్ ఆదివారం గ్రౌండ్ను పరిశీలించి శుభ్రం పరచాలని పత్రికలకు తెలియజేయడంతో వార్తకు స్పందించి జోనల్ కమిషనర్ దగ్గరుండి మరి శుభ్రం చేయించారు. దీని పట్ల క్రీడాకారులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కౌన్సిల్‌కు ఇద్దరు ఎన్నిక

ప్రజాశక్తి-పరవాడ

ఏలూరు టౌన్‌లో ఆదివారం జరిగిన ఏపీ ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (సిఐటీయూ) ఏపీ కౌన్సిల్ ఆరో మహాసభలో రాష్ట్ర కౌన్సిల్‌కు అనకాపల్లి బ్రాంచి నుండి సీనియర్ ఏజెంట్లు పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామానికి చెందిన వెన్నెల సన్యాసిరావు, గొర్ల శంకర్రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి జోనల్ ప్రెసిడెంట్ మంజునాథ్ శుభాకాంక్షలు తెలియజేశారు. తను రాష్ట్ర కౌన్సిల్‌కు ఎన్నుకున్నందుకు యూనియన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఏజెంట్ల హక్కులు, పాలసీదారుల రక్షణ, ప్రజల మేలు కోసం కృషి చేస్తామని చెప్పారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్టీపీసీ సింహాద్రి అధికారులు, సిబ్బంది

ఎన్‌టిపిసిలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : ఎన్టీపీసీ సింహాద్రి యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2025 ప్రారంభమైంది. ప్రాజెక్ట్ హెడ్ సమీర్ శర్మ హాజరై ఇంటిగ్రిటీ ప్లెడ్జ్ (నిబద్ధత ప్రమాణం) చేయించారు. అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు నిర్వహించనున్న ఈ అవేర్‌నెస్ వీక్‌లో "విజిలెన్స్ - మన అందరి బాధ్యత" అనే థీమ్‌తో పారదర్శకత, నైతికత, బాధ్యతాయుత వ్యవహారం వంటి విలువలను ప్రోత్సహించనున్నారు. అవినీతి కారణాలు, దాని ప్రభావం, సమాజంపై దుష్పరిణామాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సమీర్ శర్మ తెలిపారు. సంస్థలో ప్రతి ఉద్యోగి నైతిక విలువలకు కట్టుబడి, సమాజానికి అవినీతి రహిత వాతావరణాన్ని అందించాలని సూచించారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ద్వారా ఉద్యోగుల్లో నిబద్ధతా స్ఫూర్తి పెంపొందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

ప్రజాశక్తి-మునగపాక : కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వాడ్రాపల్లి దక్షిణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక కొత్తపేట శివాలయంలో ఉదయం 4 గంటలకే భక్తులు పోటెత్తారు. ఒక పక్క తుపాను హెచ్చరికలు జారీ చేసినప్పటికీ భక్తులు ఆలయాలకు చేరుకొని పూజలు చేశారు. స్థానిక త్రినాథస్వామి, ఏటికొప్పాక, సోమలింగపాలెం శివాలయాలను దర్శించుకున్నారు.

సబ్బవరం : మండలంలోని దేవీపురంలో శైవపుణ్య క్షేత్రంలో శివ లింగాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఎంవీపీ కాలనీ శ్రీసత్య సాయి సేవా సమితి వారు పుణ్యక్షేత్రాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ పూజల్లో జపాన్ దేశస్తులు ఆకిహికో పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని ఆనందపురం, ఏ.కోడూరు, కొరువాడ, కోటపాడు, చౌడువాడ, గొండుపాలెం, సంతపాలెం శివాలయాల్లో ఉదయం నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రసాదం వితరణ

అనకాపల్లి రూరల్ : అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్తీక్ మాసం మొదట సోమవారం సందర్భంగా కోటవీధి శ్రీబోగలింగేశ్వర సమేత సర్వకామంద అమ్మవారి దేవస్థానంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ మాజీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పెంటకోట నర్సింగరావు, పిఎస్ అప్పారావు, బిఎస్ఎంకె జోగినాయుడు, పెంటకోట ప్రభాకర్, భర్నికాన శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



ప్రసాదం అంద జేస్తున్న బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ప్రతినిధులు

'కాములగెడ్డ'ను మేజర్ ఇరిగేషన్ ట్యాంక్‌గా గుర్తించాలని

గిరిజన మత్స్యకారుల జలదీక్ష

ప్రజాశక్తి- రావికమతం :. మండలంలో ధర్మవరం పంచాయతీ కాముల గెడ్డ మినీ రిజర్వాయరును మేజర్ ఇరిగేషన్ ట్యాంక్‌గా గుర్తించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు డిమాండ్ చేశారు.కాముల గెడ్డ రిజర్వాయర్‌లో గిరిజనులతో కలిసి జలదీక్ష చేస్తూ వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ కాముల గెడ్డ మినీ రిజర్వాయర్‌ను మేజర్ ఇరిగేషన్ ట్యాంక్‌గా గుర్తించాలని ఈ ఏడాది ఆగస్టు 11న జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్‌లో అర్జీ సమర్పిస్తే, కలెక్టర్ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు వచ్చి, ట్యాంకును పరిశీలించి కొలతలు వేయగా, 315.62 ఎకరాల విస్తీర్ణంలో రిజర్వాయర్ గర్భం ఉన్నట్లు గుర్తించి కలెక్టర్‌కు నివేదించారన్నారు. మేజర్ నీటిపథకంగా గురించడానికి అభ్యంతరం లేదని గ్రామపంచాయతీ నుంచి ఎన్‌ఒసి కూడా అందజేశారన్నారు. అయినప్పటికీ, నర్సీపట్నం మత్స్యశాఖ విభాగం ఎడి తదుపరి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాముల గెడ్డ మినీ రిజర్వాయర్ పరిధిలో పాత ధర్మవరం, ధర్మవరం గ్రామానికి చెందిన గదబ పివిటిజి గిరిజనులు 2022లో పోతురాజుబాబు గిరిజన మత్స్యకార సహకార సంఘాన్ని ఏర్పాటు చే సి, జలాశయంలో చేపల పెంపకంద్వారా జీవనోపాధి పొందారన్నారు. అప్పట్లో చేపల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందించేందన్నారు. అయితే నాలుగేళ్లుగాచేపపిల్లల సరఫరా చేయకపోవడంతో చేపల పెంపకం సాగక జీవనోపాధిని కోల్పోయిన గిరిజన మత్స్యకారులు వలసబాట పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా నర్సీపట్నం మత్స్యశాఖ ఎడి, ఇతర అధికారులు తగు చర్యలు చేపట్టి కాములగెడ్డ రిజర్వాయరును మేజర్ ట్యాంకుగా గుర్తించి, గిరిజన మత్స్యకారుల జీవనోపాధికి సహకరించాలని గోవిందరావు కోరారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో గిరిజన మత్స్యకారులంతా కలెక్టరేట్‌ను ముట్టడించి ఆందోళన చేయకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు గోరా చిరంజీవి, సిరగం అర్జున్, లవడు ఎర్రయ్య పాల్గొన్నారు.


జలదీక్షలో పాల్గొన్న సిపిఎం నేత గోవిందరావు, మత్స్యకారులు

పునరావాస కేంద్రాల ఏర్పాటు

తీరంలో అప్రమత్తంగా అధికార యంత్రాంగం


పునరావాస కేంద్రాల వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి -నక్కపల్లి: మొంథా తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తమైన అధికార యంత్రాంగం తీర ప్రాంత గ్రామాల్లో తొమ్మిది పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, పలు శాఖల అధికారులను, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. తహసిల్దార్ ఆర్ నరసింహమూర్తి, ఎంపిడిఒ డి సీతారామరాజు సోమవారం తీరప్రాంతాల్లో పర్యటించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డిఎల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద తీనార్ల ఎంపిపి స్కూల్, బంగారమ్మ పేట, అమలాపురం, పాటిమీద, మూలపర్ర,చందనాడ, రాజయ్యపేట, బోయపాటి గ్రామాల్లో తుఫాన్ రక్షిత భవనాల్లో పునరావస కేంద్రాలను ఏర్పాటుచేశారు. విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మధ్యాహ్నం భోజన నిర్వాహకులను అందుబాటులో ఉంచారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యోగులకు ఎవరికి సెలవులు మంజూరు చేయలేదని, అందరూ అందుబాటులో ఉన్నారన్నారు. పునరావాస కేంద్రాలకు వచ్చేవారికి భోజనం, వసతి సౌకర్యం కల్పించేందుకు అంతా సిద్ధం చేశామన్నారు. ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని వెల్లడించారు. కాగా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది.

సేవా కార్యక్రమాలలో మేటి చక్రవర్తి దంపతులు


దుస్తులు, పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నలుగురికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజా సమస్యలపై పనిచేస్తున్న టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, విల్లూరి తిరుమల దేవి దంపతులు అభినందనీయులని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కొనియాడారు. విల్లూరి చిన్నతల్లి ఛారిటబుల్ ట్రస్ట్ 18వ వార్షికోత్సవం, విశాఖ అర్బన్ టిడిపి పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. నియోజకవర్గంలో దీర్ఘకాలంగా నెలకొన్న వెంకటేశ్వర మెట్ట సమస్యపై చక్రవర్తి అనేక విధాలుగా పోరాడని ప్రశంసించారు ప్రత్యేక అతిథిగా హాజరైన టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి సుశిక్షితుడైన కార్యకర్తగా చక్రవర్తి పార్టీకి సేవలందించారన్నారు. అనంతరం మహిళలకు చీరలు, జాకెట్లు, పేదలకు పళ్ళు, రొట్టెలు అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చక్రవర్తి పలు సమస్యలను అతిథుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వర మెట్ట వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి శ్రీను, తనకాల గోవింద్, పీలా రవి, కోరుబిల్లి ఆది, త్రినాథ్, సింగంపల్లి మాధవి, మీనాక్షి పాల్గొన్నారు.

డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిడిగా రజిత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్‌గా కె.రజిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె విజయనగరం, అనకాపల్లి ప్రాంత డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. 2013లో ఆమెకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. పశ్చిమగోదావరి జిల్లాలో 2013నుంచి 2016 వరకూ అసిస్టెంట్ డైరెక్టర్‌గా, 2017 నుంచి 2022 వరకు విశాఖ ఎడిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం విజయనగరం ఎడిగా ఇప్పటి వరకూ విధులు నిర్వహించి, ప్రస్తుతం ఉద్యోగోన్నతి సాధించారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది ఆమెను అభినందించారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు!

- మొంథా ముంచుకొస్తున్నా యథావిధిగా పాఠశాల నిర్వహణ
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపణలు
- 'ఇమ్మాన్యుయేల్' యాజమాన్య నిర్వాకంపై ఎస్ఎఫ్ఐ ధ్వజం

ప్రజాశక్తి -నర్సీపట్నం : తీవ్ర తుపాన్ మొంథా దూసుకొస్తోందని, పిల్లల ప్రాణరక్షణ దృష్ట్యా విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించడంతోపాటు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్పష్టమైన హెచ్చరికలు, ఆదేశాలు జారీ చేసినప్పటికీ, మాకవరపాలెం ఇమ్మాన్యుయేల్ కళాశాల యథావిధిగా క్లాసులు నిర్వహించింది. దీనిపై ఎస్ఎఫ్ఐ నాయకులు జనార్దన్, సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కలెక్టర్ ఆదేశాలను ఎలా బేఖాతరు చేస్తారని ప్రశ్నించారు. విద్యార్థులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని, ఇది విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడడమేనని మండిపడ్డారు. ఇలాంటి చర్యలు పునరావృతం కావడం, మరో విద్యాసంస్థ ఇలా వ్యవవహరించకుండా, తక్షణమే ఇమ్మాన్యుయేల్ విద్యాసంస్థ గుర్తింపు రద్దు చేయాలని కోరారు, కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు మోహన్, భార్గవ్,గంగా, లోవరాజు, తరుణ్ పాల్గొన్నారు.


తరగతి గదిలో ఉన్న విద్యార్థులు



పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ నేతల నిరసన

అన్నసమారాధన


ఉపమాకలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి : .కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకొని మండలంలోని ఉపమాక శివాలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు .అర్చకులు మహేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద హెటిరో యాజమాన్యం, భక్తుల ఆర్థిక సహాయంతో అన్న సమారాధనలో .పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, గ్రామ పెద్దలు, యువత ఏర్పాట్లను పర్యవేక్షించి, సహకరించారు.

తుపానుతో పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మొంథా తుఫాను ముప్పు దృష్ట్యా ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈస్ట్ కోస్ట్ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. వాల్తేరు డివిజన్‌లోని పలు మార్గాల్లో నడిచే అనేక కోచింగ్ రైళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. భారత వాతావరణ శాఖ హెచ్చరిక నివేదికల ఆధారంగా ముందు జాగ్రత్త చర్యగా ఈ రద్దును చేపట్టినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ క్రమంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో విశాఖపట్నం నుండి బయలుదేరే ఇతర మార్గాల్లో నడిచే మొత్తం 29 రైళ్లను రద్దు చేశారు. ఈ క్రమంలో అక్టోబర్ 27న 18515 విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్, 18512 విశాఖపట్నం - కోరాపుట్ ఎక్స్‌ప్రెస్, 18526 విశాఖపట్నం-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్, 67287 విశాఖపట్నం - విజయనగరం మెములను రద్దు చేశారు.

28న 18516 కిరండూల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్, 58501 విశాఖపట్నం - కిరండూల్ ప్యాసింజర్, 58502 కిరండూల్ - విశాఖపట్నం ప్యాసింజర్, 58538 విశాఖపట్నం - కోరాపుట్ ప్యాసింజర్, 58537 కోరాపుట్ - విశాఖపట్నం ప్యాసింజర్, 18511 కోరాపుట్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 67285 రాజమండ్రి - విశాఖపట్నం మెము, 67286 విశాఖపట్నం-రాజమండ్రి మెము, 17268 విశాఖపట్నం - కాకినాడ ఎక్స్‌ప్రెస్, 17267 కాకినాడ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 08584 తిరుపతి-విశాఖపట్నం స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 22875 విశాఖపట్నం-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22876 గుంటూరు-విశాఖపట్నం డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 18525 బ్రహ్మపూర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 67289 విశాఖపట్నం-పలాస మెము, 67290 పలాస-విశాఖపట్నం మెము, 67288 విజయనగరం-విశాఖపట్నం మెము, 68433 కటక్-గుణుపూర్ మెము, 58531 బ్రహ్మపూర్-విశాఖపట్నం ప్యాసింజర్, 58532 విశాఖపట్నం- బ్రహ్మపూర్ ప్యాసింజర్, 58506 విశాఖపట్నం- గుణుపూర్ ప్యాసింజర్, 58505 గుణుపూర్- విశాఖపట్నం ప్యాసింజర్, 12862 మహబూబ్‌నగర్- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 22870 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. 29న 68434 గుణుపూర్-కటక్ మెము రైలును రద్దు చేశారు.



మత్స్యకారుల జీవితాలతో చెలగాటం

- బల్క్‌డ్రగ్ పార్కుతో మనుగడ ప్రశ్నార్థకం
- న్యాయం జరిగే వరకూ అండగా ఉంటా
- బిసివై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్



సంఘీభావ ర్యాలీలో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి -నక్కపల్లి : సముద్ర తీర ప్రాంతాల్లో విషతుల్య పరిశ్రమలు ఏర్పాటు చేసి మత్స్యకారుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటమాడుతోందని భారత చైతన్య యువజన(బిసివై) పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. సోమవారం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్స్యకారుల శాంతియుత రిలే దీక్షలు 44వ రోజుకు చేరిన సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించారు. మత్స్యకారుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకారులు తమ సమస్యలను రామచంద్ర యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. హెటిరో డ్రగ్స్ రాకముందు, తర్వాత తమ జీవన విధానంలో మార్పులు,ఇబ్బందులను వివరించారు. సముద్రం కలుషితమై చేపలు నశించిపోయి, జీవనోపాధి కోల్పోవడంతోపాటు కంపెనీ కాలుష్యంతో రోగాల బారిన పడి అల్లాడిపోవడంతోపాటు ఎందరో ప్రాణాలు కోల్పోయారని వాపోయారు. గోరుచుట్టిపై రోకలిపోటులా ఇపుడు బల్క్ డ్రగ్ పార్కు వచ్చిపడిందని, తమ మనుగడను ప్రశ్నార్థకం చేసే కంపెనీ వద్దని వేడుకుంటుంటే, పోలీసుల కేసులు పెట్టి, ఆంక్షలతో ప్రభుత్వం వేధిస్తోందని ఆవేదన వెలిబుచ్చారు.

దీనిపై రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ ఒడిశా నుంచి తమిళనాడు వరకు తీరాన్ని టార్గెట్ చేసిన ప్రభుత్వాలు, అభివృద్ధి పేరుతో విషతుల్య పరిశ్రమలు ఏర్పాటు చేసి మత్స్యసంపదను కొల్లగొట్టి, మత్స్యకారుల జీవితాలను నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నాయన్నారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాలు వ్యవసాయానికి యోగ్యం కాని బీడు భూములుంటే, అక్కడ కాకుండా జనావాసాల మధ్య, వ్యవసాయ భూముల్లోనూపరిశ్రమలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ,ప్రజలు నివసించలేని ప్రాంతాల్లో, బీడు భూముల్లో పరిశ్రమలను అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రాన్ని సింగపూర్ తరహాలో అభివృద్ధి చేస్తానని చెబుతున్న సిఎం చంద్రబాబు, సింగపూర్‌లోకానీ, తీర ప్రాంతం కలిగి ఉన్న మరో రాష్ట్రంలో కానీ మత్స్యకారుల జీవితాలను, పొట్ట కొట్టే విష తుల్య పరిశ్రమలను ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. విదేశీ కంపెనీలతో ప్రభుత్వం చీకటి ఒప్పందాలను చేసుకున్న ప్రభుత్వాలు మత్స్యకారుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆక్షేపించారు. కరేడు ప్రాంతంలో మత్స్యకారులను బెదిరించి గ్రామాన్ని ఖాళీ చేస్తున్నారని, ఇక్కడ రాజయ్యపేటలో వేలాదిమంది మత్స్యకారుల జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు.

44 రోజులుగా మత్స్యకారులు శాంతియుత రిలే దీక్షలు చేపడితే, సమస్య పరిష్కరించకుండా, అరెస్టులు, కేసులతో భయభ్రాంతులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అక్రమ కేసులను వెంటనే తొలగించకుంటే ప్రభుత్వం ,హోంమంత్రి సమాధానం చెప్పేరోజు కచ్చితంగా వస్తుందని హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మత్స్యకారులకు అండగా ఉంటానని మాటిచ్చిన హోంమంత్రి అనిత, ఇపుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాజయ్యపేట మత్స్యకారులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు ప్రతిపాదనను వెనక్కు తీసుకునే వరకు ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా మత్స్యకారులకు అండగా పోరాటం చేస్తానన్నారు.తానిక్కడకు రాకుండా పోలీసులు అనేక ఆంక్షలు, కేసులు పెట్టారని, చివరకు హైకోర్టు అనుమతితో వచ్చానన్నారు. మత్స్యకారుల ఆందోళన శిబిరం నుండి ర్యాలీగా గ్రామానికి చేరుకుని, అక్కడినుండి సముద్ర తీర ప్రాంతానికి వెళ్లి మత్స్యకారులతో కలిసి బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు, మహిళలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సత్యవతి, తదితరులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : వచ్చేనెల 8 9 తేదీల్లో అనకాపల్లి పట్టణంలో నిర్వహించే ఆశా వర్కర్ల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వజ్రపు సత్యవతి పిలుపునిచ్చారు. సోమవారం నర్సీపట్నం సిఐటియు కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆశ వర్కర్ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ, ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆశ వర్కర్లకు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని, ఎఎన్ఎం శిక్షణ పొందిన అర్హులైన ఆశాలకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఆశాల సమస్యలపై రాష్ట్రమహాసభల్లో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. జిల్లాలోని ఆశాలు హాజరై. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అరుణ, సత్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

న్యాయసేవలపై ఖైదీలకు అవగాహన



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం సబ్ జైలును సోమవారం న్యాయసేవాధికార సంస్థ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలయిఅ చట్టసేవలపై అవగాహన సదస్సును నిర్వహించారు, ఖైదీలకు చట్టపరమైన హక్కులు, లీగల్ ఎయిడ్ సేవలు, ఫిర్యాదు విధానం వంటి అంశాలపై వివరించారు. ఖైదీల సమస్యలను తెలుసుకుని, వాటిని సంబంధిత విభాగాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొని జైలు పరిపాలన, ఖైదీల సంక్షేమం, పునరావాస చర్యలపై చర్చించారు.. సదస్సులో సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి పి. షియాజ్‌ఖాన్, టౌన్ సీఐ గోవిందరావు, ఎంఇఒ తలుపులు, నాగేంద్ర, జైలు విజిటింగ్ లాయర్ గోవర్ధన్, గిరి, జైలు సిబ్బంది పాల్గొన్నారు

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో అమలాపురం గ్రామంలో సోమవారం కనక మహాలక్ష్మి, బంగారమ్మ తల్లి, నూకాలమ్మ ఆలయాల ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించు కున్నారు. పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు కూడా అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. . గ్రామస్తుల సహాయ, సహకారాలతో భారీ అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలు ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.

దళిత కాలనీలో మౌలిక సదుపాయాలపై ఆరా

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలోని చిన్న బొడ్డేపల్లి గ్రామంలో దళిత కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు ఆరా తీశారు. 'గూడు కోసం వేడుకోలు' శీర్షికన సోమవారం ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. తహసిల్దార్ తిరుమల బాబు, ఎంపీడీవో చంద్రశేఖర్ సిబ్బంది గ్రామానికి చేరుకొని కాలనీలో మౌలిక వసతులపై ఆరా తీశారు. తుఫాను ప్రభావంతో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారికి పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. రాత్రి సమయంలో సమీపంలో గల రైతు భరోసా కేంద్రంలో ఉండేందుకు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్, తహసిల్దార్ తిరుమల బాబు మాట్లాడుతూ దళిత కాలనీలో దీర్ఘకాలిక సమస్య అని, వారి సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి కూర్మారావ్, ఆర్ఐ మణికంఠ, కార్యదర్శి రఘురాం, గ్రామ రెవెన్యూ అధికారి పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

పుస్తక మహోత్సవం 30కి వాయిదా

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 28 నుంచి నవంబర్ 5 వరకు జరగాల్సిన పుస్తక మహోత్సవం 30వ తేదీకి వాయిదా పడింది. మొంథా తుఫాన్ కారణంగా వాయిదా వేయడం జరిగిందని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 వరకు వర్షాలు, గాలులు తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున సందర్శకుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వాయిదా వేయడం జరిగిందని పేర్కొన్నారు. పుస్తక ప్రేమికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		